# రత్నాకర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మాజీ మంత్రి పల్లె





పుట్టపర్తి, అనంత సూర్య: సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ శ్రీ ఆర్.జే. రత్నాకర్ జన్మదిన వేడుకలు పుట్టపర్తిలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి హాజరై రత్నాకర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవిస్తూ సత్యసాయి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగించాలని ఆకాంక్షించారు. అనంతరం జానకిరామయ్య కళ్యాణ మండపంలో నిర్వహించిన అన్నవితరణ కార్యక్రమంలో రత్నాకర్‌తో కలిసి పల్లె రఘునాథ్ రెడ్డి పాల్గొని భక్తులు, అభిమానులు, ప్రజలకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. శ్రీకృష్ణాష్టమి సందర్భంగా గోకులంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లోనూ ఇరువురు పాల్గొన్నారు. కార్యక్రమాల్లో కూటమి పార్టీల నాయకులు గంగాధర నాయుడు, సామకోటి ఆదినారాయణ, తోట గంగాధర్, కృష్ణ ప్రసాద్, జయప్రకాష్, బేకరి నాయుడు, సురేష్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

# బాలకృష్ణకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు



అనంతపురం, సెప్టెంబర్ 4 అనంత సూర్య : భాష్యం విద్యాసంస్థలు అనంతపురం ప్రిన్సిపల్ ఎం.బాలకృష్ణ ప్రతిష్టాత్మకమైన ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. మినిస్ట్రీ ఆఫ్ యత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, ఎస్సార్ ఎడ్యుకేషనల్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని అందజేశారు. విద్యారంగంలో ప్రిన్సిపల్‌గా బాలకృష్ణ అందిస్తున్న సేవలు, విద్యార్థుల అభివృద్ధికి చేస్తున్న కృషి, పాఠశాల నిర్వహణలో చూపుతున్న అంకితభావాన్ని గుర్తించి ఈ ప్రతిష్టాత్మక అవార్డుకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ పద్మశ్రీ, ఎసఎస్‌బీఎన్ కళాశాల ప్రిన్సిపల్ పతికి రమేష్ నారాయణ తమ విలువైన సమయాన్ని కేటాయించి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. వారి సమక్షంలో భాష్యం విద్యాసంస్థల ప్రిన్సిపల్ బాలకృష్ణ ప్రతిష్టాత్మకమైన ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ.. తనను ఈ అవార్డుకు ఎంపిక చేసి ప్రోత్సహించిన ఎస్సార్ ఎడ్యుకేషనల్ సొసైటీ ముఖ్యంగా సుంకర రమేష్, బిసాతి భరత్, మారుతీ, జీవన్ కుమార్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ అవార్డు తనకు కేవలం ఒక గౌరవం మాత్రమే కాకుండా, విద్యార్థుల అభివృద్ధి కోసం మరింత బాధ్యతతో, అంకితభావంతో పనిచేయడానికి గొప్ప ప్రేరణనిచ్చిందని ప్రిన్సిపల్ బాలకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా భాష్యం పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రిన్సిపల్ బాలకృష్ణకు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

# ప్రపంచంలో ఉపాధ్యాయ వృత్తిని మించిన వృత్తి మరొకటి లేదు










అనంతపురం, సెప్టెంబర్ 4 అనంత సూర్య : సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని, ప్రపంచంలో ఉపాధ్యాయ వృత్తిని మించిన గొప్ప వృత్తి మరొకటి లేదని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఎసార్ ఎడ్యుకేషనల్ సొసైటీ, మేరా యువ భారత్, కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక ఆర్ట్స్ కళాశాల డ్రామా హాలులో గురుపూజోత్సవం, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ పతికి రమేష్ నారాయణ, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.పద్మశ్రీ, మై భారత్ ప్రతినిధి బిసాటి భరత్, ఎస్సార్ ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపకులు సుంకర రమేష్, రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ డాక్టర్ గీతా బాల తదితరులు పాల్గొన్నారు. అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు విద్యార్థులకు కేవలం పాఠ్యాంశాలను మాత్రమే బోధించకుండా, వారి జీవితాలకు మార్గదర్శకులుగా నిలుస్తారు. సమాజానికి మంచి పౌరులను అందించడంలో ఉపాధ్యాయుల పాత్ర అమూల్యం. ఉపాధ్యాయుల సేవలను గుర్తించి సత్కరించడం అభినందనీయం అని అన్నారు. అనంతరం 'ఏక్ పేడ్ మా కే నామ' అంబాసిడర్ సుంకర నవనీ ఏర్పాటు చేసిన స్టాల్‌ను, రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బ్లడ్ గ్రూపింగ్ స్టాల్‌ను అతిథులు పరిశీలించారు. తదనంతరం జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఉత్తమ సేవలు అందిస్తున్న 65 మంది ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ ఛైర్మన్ డాక్టర్ గజ్జల లక్ష్మణ ప్రసాద్, ఎస్సార్ ఎడ్యుకేషనల్ సొసైటీ సహ వ్యవస్థాపకులు పి.దీపు కిరణ్ రెడ్డి, సభ్యులు ధోని, శ్రీశ్రీ కళావేదిక రాష్ట్ర అధ్యక్షులు గుత్తా హరిసర్వోత్తమ నాయుడు, రాయలసీమ ప్రజా సమాఖ్య అధ్యక్షులు గొర్తి వెంకట స్వామి, అధ్యాపకులు, విద్యార్థులు, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# దగ్ధమైన బస్సును పరిశీలించిన అనంత ఎస్పీ జగదీశ



అనంతపురం క్రైం ప్రతినిధి, సెప్టెంబర్ 4 అనంత సూర్య : బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు జిల్లాలోని పెద్దవడగూరు మండలం మిడతూరు సమీపంలోని జాతీయ రహదారిపై అగ్నిప్రమాదానికి గురై పూర్తిగా దగ్ధమైంది. ఈ సమాచారం అందుకున్న జిల్లా ఎస్పీ జగదీష్ ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద తీవ్రతను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రమాదం అసలు ఎలా జరిగింది ? మంటలు వ్యాపించడానికి గల కారణాలేంటి ? అనే వివరాలను స్థానిక డీఎస్పీ, సీఐలను అడిగి ఎస్పీ తెలుసుకున్నారు. ఘటనపై పూర్తిస్థాయి లోతుపాతులపై సమగ్ర విచారణ జరిపి నివేదిక అందజేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీతో పాటు గుంతకల్లు డీఎస్పీ ఏ.శ్రీనివాస్, సిఐలు నరేంద్రరెడ్డి, శివశంకర్ నాయక్, ఎస్సై రాఘవేంద్రప్ప, తదితరులు వెళ్లారు.

# తక్కువ ధరకు నాణ్యమైన బియ్యం పంపిణీ



అనంతపురం అనంత సూర్య: బహిరంగ మార్కెట్‌లో పెరుగుతున్న బియ్యం ధరలను దృష్టిలో ఉంచుకుని పేద, మధ్యతరగతి ప్రజలకు తక్కువ ధరకు నాణ్యమైన బియ్యం అందించేందుకు జిల్లాలో నాలుగు ప్రత్యేక బియ్యం కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్ తెలిపారు. అనంతపురం రైతుబజారు, గుంతకల్లు మార్కెట్ యార్డు, రాయదుర్గం రైల్వే స్టేషన్ సమీపంలోని నేతాజీ రోడ్డు, తాడిపత్రి పాత బస్టాండ్ సమీపంలోని మెయిన్ బజార్‌లో ఈ కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఆవిరి బియ్యం కిలో రూ.52, ముడి బియ్యం కిలో రూ.50 చొప్పున ఆధార్ లేదా రేషన్ కార్డుపై 26 కిలోల వరకు బియ్యం అందిస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేక కౌంటర్లు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, సాయంత్రం 3 నుంచి 6 గంటల వరకు పనిచేస్తాయని పేర్కొన్నారు. నాణ్యత, సరైన తూకం, నిర్ణీత ధరల అమలుపై అధికారులు నిరంతరం తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. అర్హులైన వినియోగదారులకు పారదర్శకంగా బియ్యం అందేలా చర్యలు తీసుకుంటున్నామని జాయింట్ కలెక్టర్ తెలిపారు.

# హిందూపురంలో ముమ్మరంగా విజిబుల్ పోలీసింగ్

## ట్రాఫిక్ సమస్యలపై ప్రత్యేక దృష్టి.. వాహనాల తనిఖీలు





హిందూపురం అనంత సూర్య: పట్టణంలో ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు పోలీసులు ముమ్మరంగా విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఎస్. సతీష్‌కుమార్ ఐపీఎస్ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ కేవీ మహేష్ పర్యవేక్షణలో వన్‌టౌన్ సీఐ ప్రసాద్‌బాబు, ఎస్సై రాజేష్ సిబ్బందితో కలిసి ప్రధాన కూడళ్లలో తనిఖీలు చేపట్టారు. ఓల్డ్ ఎన్టీఆర్ సర్కిల్, అంబేద్కర్, ఇందిరమ్మ, రిజిస్ట్రార్ కార్యాలయం, సద్భవన్ బీఎస్టీ, ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతాల్లో వాహనాలను తనిఖీ చేసి పత్రాలు లేని వాహనాలపై జరిమానాలు విధించారు. మైనర్ల డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్, బహిరంగ మద్యపానంపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించేలా రోడ్లపై వ్యాపారాలు నిర్వహించవద్దని దుకాణదారులు, తోపుడుబండ్ల నిర్వాహకులకు పోలీసులు సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ ప్రసాద్‌బాబు హెచ్చరించారు.

# కదిరిలో నేర నియంత్రణకు కఠిన చర్యలు

## 482 ట్రాఫిక్ కేసులు.. రూ.5.43 లక్షల జరిమానా



కదిరి, అనంత సూర్య: పట్టణంలో నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ, రోడ్డు భద్రతకు పోలీసులు కఠిన చర్యలు చేపడుతున్నట్లు డీఎస్పీ శివనారాయణస్వామి, సీఐ బి. వెంకటేశ్వర్లు తెలిపారు. జిల్లా ఎస్పీ ఎస్. సతీష్‌కుమార్ ఐపీఎస్ ఆదేశాల మేరకు రౌడీషీటర్లు, హిస్టరీషీటర్లపై నిఘా, రాత్రి పహారా, వాహన తనిఖీలు ముమ్మరం చేసినట్లు పేర్కొన్నారు. జూలై, ఆగస్టు నెలల్లో 11 కేసులకు సంబంధించి 38 మందిపై బాండ్‌ఓవర్ చర్యలు చేపట్టగా, నిబంధనలు ఉల్లంఘించిన ఐదుగురికి ఫోర్‌ఫీచర్ నోటీసులు జారీ చేశారు. ఒకరిని జ్యుడిషియల్ రిమాండ్‌కు పంపారు. పలు నేరాల్లో ప్రమేయం ఉన్న రౌడీషీటర్ షేక్ ముజాహిద్ అలియాస్ ముజ్జుపై పీడీ యాక్ట్ అమలు చేశారు. జూలై 15 నుంచి ఆగస్టు 31 వరకు మొత్తం 482 ట్రాఫిక్ కేసులు నమోదు చేసి రూ.5,43,740 జరిమానా వసూలు చేశారు. ఇందులో 68 డ్రంకెన్ డ్రైవింగ్ కేసులు నమోదు చేసి రూ.4,09,000 జరిమానా వసూలు చేయగా, ఏడుగురిని జైలుకు పంపారు. ఇతర ట్రాఫిక్ ఉల్లంఘనలపై 414 కేసులు నమోదు చేశారు. దొంగతనాల నివారణకు రాత్రి పహారాను పెంచడంతో పాటు ప్రధాన కూడళ్లు, అనుమానాస్పద ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా కొనసాగుతోంది. మహిళలు, బాలల భద్రత, మాదకద్రవ్యాల నివారణ, ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. నేర నియంత్రణ, ప్రజా భద్రత కోసం చర్యలు నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు.



అనంత సూర్య
తెలుగువార్త
శనివారం 05 సెప్టెంబరు 2026

# ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

పెనుకొండ, సెప్టెంబర్ 04 (అనంత సూర్య): పెనుకొండ పట్టణంలోని కోటలోపల వెలసిన శ్రీ వేణుగోపాల స్వామిదేవాలయంలో కృష్ణాష్టమి వేడుకలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పెనుకొండ ఆర్డీవో ఆనంద్ కుమార్ హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక



పూజల్లోపాల్గొన్నారు. వేడుకల్లో భాగంగా సరస్వతి విద్యా మందిర్ పాఠశాల విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో పాల్గొని వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. చిన్నారుల ఆకట్టుకునే వేషధారణలు, సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

# ఎమ్మెల్యే దగ్గుపాటి నివాసంలో వైభవంగా వరలక్ష్మి వ్రత పూజలు

- పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు
- మహిలళకు వాయినాలు అందజేసిన దగ్గుపాటి శ్రీలక్ష్మీ



అనంతపురం, సెప్టెంబర్ 4 అనంత సూర్య : శ్రావణమాసం మూడవ శుక్రవారాన్ని పురస్కరించుకుని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి నివాసంలో వరలక్ష్మి వ్రతాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాన్ని ఎమ్మెల్యే దంపతులు అత్యంత సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ, నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని వారు అమ్మవారిని వేడుకున్నారు. ఈ పూజా కార్యక్రమంలో అత్యంత ఆప్తులు, బంధుమిత్రులు మాత్రమే పాల్గొన్నారు. వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ అమ్మవారి కలశ స్థాపన చేసి, ప్రత్యేక అర్చనలు, నైవేద్యాలు సమర్పించారు. పూజ అనంతరం ఎమ్మెల్యే సతీమణి దగ్గుపాటి శ్రీలక్ష్మీ సుమంగళి పూజలు నిర్వహించి, వేడుకకు విచ్చేసిన మహిళలందరికీ తాంబూలాలతో పాటు వాయినాలు అందజేశారు. విచ్చేసిన అతిథులకు తీర్థప్రసాదాలు వితరణ చేశారు. నివాస ప్రాంగణమంతా శ్రావణ శోభతో, ఆధ్యాత్మిక వాతావరణం కనిపించింది.

# అనంతపురంని నెంబర్ 1 స్థానంలో నిలపడమే లక్ష్యంగా పని చేస్తా



అనంతపురం, సెప్టెంబర్ 4 అనంత సూర్య : అనంతపురం అర్బన్ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోని నెంబర్ -1 స్థానంలో నిలిపే విధంగా పనిచేస్తానని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. అర్బన్ టిడిపి కార్యాలయంలో ఆయన 57వ ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ కాలనీల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యేతో చెప్పుకున్నారు. ప్రతి ఒక్కరితో ఆయన ఓపిగ్గా మాట్లాడుతూ అర్జీలు స్వీకరించారు. కొన్ని సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ ఇప్పటివరకు 57 సార్లు ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించి... 1268అర్జీలు స్వీకరించామన్నారు. వాటన్నింటినీ సంబంధిత అధికారులకు పంపి పరిష్కారమయ్యేలా చూ-సామన్నారు. ఇందులో కేవలం 39 మాత్రమే వివిధ దశల్లో పెండింగ్ లో ఉన్నాయని చెప్పారు. గత ఐదేళ్ల వైసిపి పాలనలో ఇలాంటి కార్యక్రమాలు ఎక్కడా నిర్వహించలేదన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం దగ్గర నుంచి ఎమ్మెల్యే కార్యాలయం వరకు ప్రతి ఒక్క చోట ప్రతివారం గ్రీవెన్స్ కార్యక్రమాలు నిర్వహించి ప్రజల సమస్యలు పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. గత ఐదేళ్ల పిచ్చి తుగ్లక్ పాలనలో రాష్ట్రం వినాశనం దిశగా వెళ్లిందన్నారు. కానీ ఈ రెండేళ్ల కాలంలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు తన అనుభవంతో... రాష్ట్రాన్ని మళ్ళీ గాడిలో పెట్టి అభివృద్ధి దిశగా నడిపిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ దేశ విదేశాలు తిరిగి లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చారన్నారు. దేశానికి వస్తున్న పెట్టుబడిల్లో 25% ఏపీకే వస్తున్నాయని అన్నారు. రాయలసీమ ప్రాంతాన్ని కూడా ఇండస్ట్రియల్ హబ్ గా మారు-స్తున్నారన్నారు. చిత్తూరు జిల్లాకు బుల్లెట్ తయారు చేసే పరిశ్రమ, అనంతపురం జిల్లాకు యుద్ధ విమానాలు తయారు చేసే పరిశ్రమ, కర్నూలు జిల్లాలో డ్రోన్ తయారీ పరిశ్రమ అలాగే ఏసీలు తయారు చేసే వంటి పరిశ్రమలు తీసుకొచ్చారన్నారు. అనంతపురం జిల్లాని హార్టికల్చర్ హబ్ గా మార్చే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పని చేస్తున్నారని చెప్పారు. మరోవైపు అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో ఈ రెండేళ్ల కాలంలో 1296 కోట్ల రూపాయలతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామన్నారు. గత ఐదేళ్ల వైసిపి పాలనలో టన్నులకొద్దీ చెత్తను పెట్టిపోయారన్నారు. ఆ డంపింగ్ యార్డ్ లో చెత్తను పూర్తిస్థాయిలో క్లియర్ చేస్తున్నామని..త్వరలోనే ఆ పనులు పూర్తవుతాయని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు.

# సబ్ డివిజన్ స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం

ధర్మవరం, సెప్టెంబర్ 04 (అనంత సూర్య) : పట్టణంలోని ఆర్డిఓ కార్యాలయంలో ధర్మవరం రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఎస్సీ ఎస్టీ వర్గాల సంక్షేమం అభివృద్ధి వారి హక్కుల పరిరక్షణకు సంబంధించి సబ్ డివిజనల్ స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశమును నిర్వహించడం జరిగిందని ఆర్డీవో రామభూపాల్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి డిఎస్పి బీవీ జగన్నాథరాజు పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ వర్గాలకు సంబంధించిన వివిధ సంక్షేమ




పథకాలు అమలు వారికి అందుతున్న ప్రభుత్వ సేవలు, హక్కుల పరిరక్షణ, పెండింగ్లో ఉన్న సమస్యలు, తదితర అంశాలపై సమీక్షను నిర్వహించడం జరిగిందని తెలిపారు. అనంతరం సంబంధిత శాఖల ద్వారా చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో చర్చించడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా ఎస్సీ ఎస్టీ వర్గాలకు సంబంధించిన సమస్యలను అధికారులు ప్రాధాన్యతతో పరిష్కరించాలని నిబంధనల మేరకు తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం డివిజన్ పరిధిలోని తహసీల్దారులు, సంబంధిత శాఖల అధికారులు, డివిఎంసి సభ్యుడు ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

# శ్రీకృష్ణుడి వేషధారణలో... చిన్నారి ఆరాధ్య రాం



అనంతపురం క్రైం ప్రతినిధి, సెప్టెంబర్ 4 అనంత సూర్య : శ్రీ కృష్ణుడి వేషధారణలో రెండేళ్ల చిన్నారి ఆరాధ్య రామ్ సందడి చేసింది. శ్రీ కృష్ణాష్టమి వేడుకలలో భాగంగా.. నగరంలోని మూడో రోడ్డుకు చెందిన దుర్గప్రసాద్, వైష్ణవి దంపతుల కుమార్తె చిన్నారి ఆరాధ్య రామ్ (2) రంగురంగుల దు-స్తులు ఆభరణాలతో ముస్తాబైన చిన్నారి ప్రత్యేక ఆకర్షణంగా నిలిచింది. తలకు నెమలి పింఛం పెట్టి చేతిలో పిల్లను గ్రోవీతో బుడిబుడి అడుగులు వే-సుకుంటూ హావభావాలు చిలిపి చేష్టలతో, శ్రీకృష్ణుని వేషాధారణలో సాంప్రదాయ దుస్తులతో అందరినీ ఆకట్టుకుంది. శ్రీకృష్ణుని బాల్య ఘట్టాలను గుర్తు చేసే విధంగా వివిధ భంగిమల్లో ప్రదర్శన ఇచ్చింది. భారతదేశ సంస్కృతి సాంప్రదాయాలు ఆధ్యాత్మిక విలువలను చిన్నారికి పరిచయం చేయడంతో పాటు పండుగ విశిష్టతను తెలియజేసే ఉద్దేశంతో, వారి తల్లిదండ్రులు ఆ చిన్నారిని రెడీ చేశారన్నారు.

# శ్రీకృష్ణుడు.. గోపికల వేషధారణలో చిన్నారుల సందడి



ఉరవకొండ సెప్టెంబర్ 04 (అనంత సూర్య): శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా ఉరవకొండలో శుక్రవారం చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో సందడి చేశారు. రంగురంగుల దుస్తులు, కిరీటాలు, ఆభరణాలతో ముస్తాబైన చిన్నారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. శ్రీకృష్ణుడి వేషధారణలో కొందరు చిన్నారులు వేణ-ువును చేతబట్టి, నెమలి పింఛం ధరించి అలరించగా, గోపికల వేషధారణలో చిన్నారులు సంప్రదాయ దుస్తుల్లో ఆకట్టుకున్నారు. చిన్నారుల వేషధారణలు, హావభావాలు, చిలిపి చేష్టలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా చిన్నారులు శ్రీకృష్ణుడి బాల్య ఘట్టాలను గుర్తుచేసే విధంగా వివిధ భంగిమల్లో ప్రదర్శనలు ఇచ్చారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువలను చిన్నారులకు పరిచయం చేయడంతో పాటు పండుగల విశిష్టతను తెలియజేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. తమ పిల్లలు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో కనిపించడంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. చిన్నారుల ఉత్సాహంతో పరిసర ప్రాంతం పండుగ వాతావరణాన్ని తలపించింది.

# అనంతపురం ఎస్పీ కి ఆంధ్రప్రదేశ్ ఎస్టీ కమిషన్ సభ్యులు పి. వెంకటప్ప హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



అనంత క్రైమ్, సెప్టెంబర్ 04: ( అనంత సూర్య): ఈ సందర్భంగా శ్రీ పి. వెంకటప్ప ఎస్పీ సేవలను అభినందిస్తూ, అనంతపురం జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణలో మరింత విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

# కొండమీద రాయుడు సేవలో కుంచపు వెంకటేష్

బుక్కరాయసముద్రం, సెప్టెంబర్ 4, అనంత సూర్య : బుక్కరాయసముద్రంలో వెలసిన శ్రీశ్రీశ్రీ కొండమీద వెంకటరమణ స్వామి దేవస్థానం మెట్ల మార్గం నిర్మాణానికి టీఎన్టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, వడ్డెర సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కుంచపు వడ్డే వెంకటేశులు తన వంతు సహాయంగా రూ.30,232లను చెక్కు రూపంలో అందజేశారు. ఆయన వ్యక్తిగత కార్యాలయంలో నారాయణస్వామి,గిరి ప్రదక్షిణ గంగాధర ఆధ్వర్యంలో ఈ విరాళాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆలయ విశిష్టతను కమిటీ సభ్యులు వివరిస్తూ, ఆలయ పూజారికి స్వామివారు కలలో దర్శనమిచ్చి గిరి ప్రదక్షిణ చేయాలని సూచించినట్లు విశ్వసిస్తూ, అప్పటి నుంచి గిరి ప్రదక్షిణ ఆ ప్రతి పౌర్ణమి రోజు కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్వామివారి అనుగ్రహంతో భక్తులకు మరింత సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో 1,116 మెట్లను ఏర్పాటు చేయాలని సంకల్పించి మెట్ల మార్గం నిర్మాణ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం స్వామివారి దర్శనం కోసం వేలాది మంది భక్తులు తరలివస్తున్నారని, తమ కోరికలు నెరవేరాలని



స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటున్నారని తెలిపారు. శ్రీ కొండమీద వెంకటరమణ స్వామివారి సన్నిధిలో మొక్కులు చెల్లించుకోవడం ద్వారా తమ కోరికలు నెరవే-రుతున్నాయని ఎంతో మంది భక్తులు విశ్వసిస్తున్నారని, అందుకే ఈ పుణ్యక్షేత్రానికి భక్తుల రాక రోజురోజుకూ పెరుగుతోందన్నారు. ఈ సందర్భంగా కుంచపు వడ్డే వెంకటేశులు మాట్లాడుతూ, శ్రీ కొండమీద వెంకటరమణ స్వామి కలియుగ వైకుంఠనాథుడిగా భక్తుల కొంగుబంగారంగా నిలుస్తున్నారని, స్వామివారి ఆలయ అభివృద్ధి కార్యక్రమంలో తన వంతు భాగస్వామి కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. 1,116 మెట్ల నిర్మాణ సంకల్పం విజయవంతం కావాలని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మెట్ల మార్గం అందుబాటులోకి రావాలని ఆకాంక్షించారు. అదేవిధంగా దాతలు సహకరించి ఆలయ అభివృద్ధికి, పాటుపడాలని విరాళాలు అందజేయాలని ఈ పుణ్య కార్యక్రమం ద్వారా అందరికీ మంచి జరుగుతుందని తెలియజేశారు. శ్రీవారి కృపతో భక్తులందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, ఐశ్వర్యం కలగాలని, ప్రతి ఒక్కరి కోరికలు నెరవేరాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు పుణ్యక్షేత్రాలు, దేవ-స్థానాల అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందించడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్. నారాయణస్వామి, లక్ష్మీనారాయణ, సి.పి. నారాయణస్వామి,కె. గంగాధర,పోతులయ్య, భద్రంపల్లి ఉజినప్ప, గోవిందంపల్లి పుల్లారెడ్డి, లక్ష్మీనారాయణ, వడ్డే ప్రసాద్, వడ్డే లచ్చి, కుంచపు లక్ష్మన్న, ఆలగుంట వెంకటరాముడు, రామసాగరం ఆదినారాయణ, రామదాసు, కూడేరు బ్రహ్మయ్య తదితర ఆలయ కమిటీ సభ్యులు, పాల్గొన్నారు.

# మహిళలకు ఉచిత టైలరింగ్, బ్యూటీ పార్లర్ శిక్షణ

పుట్టపర్తి అనంత సూర్య: శ్రీ సత్యసాయి జిల్లా గ్రామీణ ప్రాంత మహిళలకు కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (ఆర్ఎస్ఈటీఐ) ఆధ్వర్యంలో టైలరింగ్, బ్యూటీ పార్లర్‌పై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ ఎన్. శాంతిప్రియ తెలిపారు.బ్రాహ్మణపల్లిలోని కెనరా బ్యాంకు ఆర్ఎస్ఈటీఐ కేంద్రంలో సెప్టెంబర్ 15 నుంచి శిక్షణ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. 18 నుంచి 50 ఏళ్లలోపు గ్రామీణ ప్రాంత మహిళలు ఈ శిక్షణకు అర్హులని తెలిపారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి సదుపాయాలు కల్పిస్తామని వెల్లడించారు.ఆసక్తి గల అభ్యర్థులు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, నాలుగు ఫొటోలు, బ్యాంకు పాస్‌బుక్ జిరాక్స్, విద్యార్హత ధ్రువపత్రం జిరాక్స్‌తో బ్రాహ్మణపల్లిలోని శిక్షణ కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 8977718982, 9391486269, 08555-286427 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

Editor, Published and Owned by C Hari Krishna, Published from D.no 1-3-780, Rajaka Nagar, Anantapur - 515001, Printed from NALIVELI EXPRESS PRINTERS Hno. 1-1A9T-10, Main Road, Pattikonda, Kurnool 518380, EDITOR : C HARI KRISHNA" Mobile number: 9182495405